36. దేహబుద్ధి బంధహేతువని, అశాంతికి మూలమని
అజ్ఞాన జనితమైన దేహబుద్ధిని విడనాడమనే వివేకమూర్తికి వందనం

37. నా, నేను అనే తలంపులు దేహతాదాత్మ్య జనితాలని, హృదయంలో సద్వస్తు ఎరుకకు
హృదయపవిత్రత ఉండాలనే చిరుదరహాసునికి వందనం

38. పరిమళ భరితమైన స్వరూపంతో శిష్యగణకోటికి
సుగంధ పరిమళాలు వెదజల్లిన మహోన్నతమూర్తికి వందనం

39. భక్తిమార్గంతో ముముక్షువులు బంధవిముక్తులై
పరమాత్మను చేరవచ్చనే భక్తజనబాంధవునికి వందనం

40. మనస్సును చింతించడమే దాని రూపనాశనమునకు మార్గమని
మనోనాశనమే మోక్షకారకమనే మనోనాశనదార్శనికునికి హృదయపూర్వక వందనం

41. యజ్ఞయాగాదులతో పనిలేదని, యాంత్రిక పూజలు వ్యర్థమని
స్వస్వరూపమెరుకకై ఆత్మవిచారణే శ్రేష్ఠమని విశదపరచిన విశ్వప్రేమికునికి వందనం

42. రజో, తమోగుణాలు బంధహేతువులని, సత్పురుషుల సహవాసంతో సత్వగుణం పొందాలని
సత్సాంగత్యమే స్వస్వరూపజ్ఞానానికి బాటయని భోదపర్చిన సత్సంకల్పమూర్తికి వందనం

43. వాసనాక్షయమై పరిపూర్ణానందం అనుభవంలోకి వచ్చేవరకు
జన్మజన్మలకు గురువు వెన్నంటి ఉంటాడని, వెన్నుతట్టి లేపిన ఔదార్యమూర్తికి వందనం

44. శరణాగతి పొందడమే మోక్షప్రాప్తికి అత్యున్నత మార్గమని
భగవత్సంకల్పమే, భక్తుడిసంకల్పమనే భక్తజనబాంధవునికి భక్తిపూర్వక వందనం

45. సత్పురుషులతో సహవాసం సద్వస్తువు ఎరుకకి పూలబాటయని
సహవాసదోషాలు ప్రతిబంధకాలని సరళమైన మాటలతో చెప్పిన సహజసౌందర్యమూర్తికి వందనం

46. జిన్నూరు వాసిగా, జిజ్ఞాసువులకు అర్థశతాబ్దిగా జ్ఞానకిరణాలను ప్రసరించి
జ్ఞానమార్గాన్ని ప్రభోధించే జ్ఞానసాగరుడు సద్గురు నాన్నగురుదేవులకు పాదాభివందనం

**పెద్దిరాజు**

డిప్యూటీ కలెక్టర్, విజయవాడ



ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 22 | సంచిక : 5 | జనవరి 2017

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 24

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 12/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....
17-01-1985 పోడూరు

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

నూతన సంవత్సర మరియు సంక్రాంతి
శుభాకాంక్షలు

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 17-01-1985, పోడూరు)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈశ్వరుడికి పశుపతి అని పేరు. మనమందరం పశువులం అంటే మన శరీరాలు పశువులు అని కాదు, మనలో ఉన్న జీవలక్షణాలు అన్నీ కూడా పశులక్షణాలే. మనలో రాగద్వేషాలు, హెచ్చుతగ్గులు, ఉద్రేకపడటం, అసూయ ఈ జీవలక్షణాలు ఉన్నంతకాలం మనం పశువులమే. మనలో ఈ పశులక్షణాలు ఎంతకాలం అయితే ఉన్నాయో అంతకాలం మనకు పశుపతి దొరకడు, అంటే ఈశ్వరుడు మనకు దొరకడు. మన స్వరూపంగా మనలో ఈశ్వరుడు ఉన్నప్పటికీ మనం అహంకారం అనే పశువును శిలువ వేస్తేనే కాని ఆయన మనకు లభ్యంకాడు. మోక్షసుఖం, ఆత్మసుఖం మనలోనే ఉంది. కాని మనం ఏమనుకొంటున్నాము అంటే మోక్షం ఎక్కడో ఉంది, మనం ఎక్కడో ఉన్నాము, దానికోసం మనం ప్రయాణం చెయ్యాలి అనుకొంటున్నాము. ఇది అంతా మన కల్పన. మన స్వరూపమే మోక్షం. అది ఇక్కడే ఉంది, ఇప్పడే ఉంది. కాని అర్థంచేసుకొనే యోగ్యత మనకు లేక మోక్షం ఎక్కడో ఉందని, మరణించిన తరువాత ఎప్పడో వస్తుందని ఇలా అనుకొంటాము. మరణించిన తరువాత ఏమీరాదు. ఇప్పడు ఎలా ఉన్నామో అలానే ఉంటాము. మన మనస్సును శుద్ధిచేసుకొనే విషయంలో చావు ఏమీ సహాయం చెయ్యదు. దారిద్ర్యం ఏమైనా కొంచెం సహాయం చేస్తే చెయ్యవచ్చు. చావు చేసే సహాయం ఒక్కటే అది శరీరాన్ని మారుస్తుంది అంటే పాతశరీరాన్ని తీసేసి క్రొత్తశరీరాన్ని యిస్తుంది అంతేకాని మన మనస్సును శుద్ధిచెయ్యటానికి చావు ఏమీ ఉపయోగపడదు.

మనలో ఉన్న పశులక్షణాలను అంటే జీవలక్షణాలను విడిచిపెట్టటమే త్యాగం. పశు రూపంలో ఉన్న ఈ జీవలక్షణాలను, అహంకారలక్షణాలను విడిచిపెట్టటమే నిజమైన పూజ. ఎవడైతే తనలో ఉన్న దుర్గుణాలను విడిచిపెట్టడో, వాడు ఎన్ని పూజలు చేసినా ఉన్న చోటే ఉంటాడు కాని వాడికి అభివృద్ధి ఏమీ కనబడదు. మనం పూజ ఎందుకు చేస్తున్నాము? మనకు లోపల ఏవో కొన్ని ఉద్దేశాలు ఉంటాయి. వాటిని నెరవేర్చుకోవటంకోసం మనం పూజలు చేస్తున్నాము. అయితే ఆ ఉద్దేశాలు మీకు నెరవేరవచ్చు నేను కాదనటంలేదు. కానీ మీకు జ్ఞానం కలుగదు. నేను ఎప్పుడైతే నాలో ఉన్న రాగద్వేషాలను విడిచిపెట్టానో అదే పూజ, అదే జపం, అదే త్యాగం. నాలో సహజంగా ఉన్న మోక్షాన్ని, జ్ఞానాన్ని తెలుసుకోవటానికి ఏ గుణాలైతే నాకు జ్ఞానవిరోధులుగా, మోక్షవిరోధులుగా ఉన్నాయో ఆ గుణాలను విడిచిపెట్టటానికి నువ్వు చేసే ప్రయత్నమే నిజమైన పూజ, అదే నిజమైన త్యాగం. అటువంటి ప్రయత్నం మీలో ఎవరైనా చేస్తున్నారా? మనోనిగ్రహం కోసం, మనస్సును ఏకాగ్రం చెయ్యటం కోసం పూజ, జపం ఇవన్నీ పెట్టారు. మన హృదయంలో ఆత్మరూపంలో ఉన్నాను అని భగవంతుడు చెపుతున్నాడు అయితే అది మనకు అనుభవంలోనికి రావటంలేదు. దానికి ఎవరో ఇతరులు కారణంకాదు, సమాజం కారణంకాదు, మన మనస్సే కారణం. నాలో ఉన్న సుఖం, శాంతి నాకు అనుభవంలోనికి రాకపోవటానికి నాలో ఉన్న గుణాలే కారణం. ఆ గుణాలను మీరు తొలగించుకోకుండా మీరు పూజ చేసినా, జపం చేసినా మీకు మోక్షం రాదు.

ఇప్పుడు భక్తుడు కానివాడు ఎవడు ఉన్నాడు. పోడూరులో నాకు దొంగతనం పారితే నేను వెంకటేశ్వరస్వామి గుడికి వెళ్తొస్తాను అని మొక్కుకొంటాను అనుకోండి. మరి నేను భక్తుడినే కదా! లేకపోతే నా దగ్గర చాలా డబ్బు ఉంది, ఇన్‌కంటాక్స్ వాళ్ళు మా ఇంటికి రాకుండా ఉంటే వెంకటేశ్వరస్వామి దగ్గరకు వెళ్ళి హుండీలో నాలుగువేలు వేస్తాను అంటాను. మరి నేను భక్తుడినే కదా! ఇంక భక్తుడు కాని వాడు ఎవడు? దొంగవాడు భక్తుడే. వాడు వినాయకుడి పూజ చేస్తాడు, వెంకటేశ్వరస్వామి డిబ్బీలో ఎంత వేస్తానని చెప్పాడో అంత తిరుపతి వెళ్ళి వేసేసి వస్తాడు. ఎలక్షన్‌లో నెగ్గినవాడు వెంకటేశ్వరస్వామి దగ్గరకు వెళతాడు, హుండీలో డబ్బు వేసి వస్తున్నాడు. వాడు భక్తుడు కాదని ఎలా అంటాము? అందరూ భక్తులే మరి భక్తులు కానివారు ఎవరు ఉన్నారు. చివరకు ఎలా తయారయ్యింది అంటే ఏది భక్తి, ఏది భక్తి కాదో తెలియకుండా మనలను కన్ఫ్యూజన్‌లో పడేసారు. చాలా సింపుల్ విషయాన్ని కాంప్లికేట్ చేసి వదిలేసారు. రావణాసురుడు మనకంటే ఎక్కువ పూజచేసాడు. రావణాసురుడు చేసినంత పూజ మనలో ఎవరు చేస్తున్నారు. వాడు భక్తుడు కాదని మనం ఎలా అంటాము. రావణాసురుడూ భక్తుడే. అయితే మనలో ఉన్న జీవలక్షణాలను అలా ఉంచేసుకొంటున్నాము. వాటిని





24. కేవలం ఉన్నది నీవే ఆత్మగానేనని ఎరుకపర్చి
ఆత్మకు భిన్నమైన నేనుకు ఉనికి లేదని తేటపర్చిన హృదయేశ్వరునికి వందనం

25. కైలాసంలోనున్న శివుడు, నీ హృదయంలోనున్న సద్వస్తువు వేరుకాదని
ద్వైతభావన వీడాలని అజ్ఞానులైన మాపై జ్ఞానకిరణాలను ప్రసరించే జ్ఞానబాంధవునికి వందనం

26. కొబ్బరినీళ్ళవంటి తియ్యనైన మాటలతో, కొబ్బరిపెంకువంటి
కఠినమైన ఉపనిషత్ భావజాలాలను విపులంగా విశదపర్చిన వసుదైకమూర్తికి వందనం

27. కోరికలు దుఃఖహేతువులని, దుఃఖనివారణకు మార్గమున్నదని
సిద్దార్థుడు బుద్ధుడైన వైనాన్ని, విశదపర్చిన జ్ఞానబోధకునికి వందనం

28. కంఠంలోనున్న మాధుర్యంతో కంటికొనలలో చేరిన కన్నీటిని
తుడిచివైచి కలువ శోభితులుగా మార్చిన కడురమ్యమూర్తికి వందనం

29. గద్గద స్వరంతో వేడుకునే గమ్యంలేని బాటసారులకు
మృదువైన ఆధ్యాత్మికబాటని చూపిన మార్గదర్శకునికి వందనం

30. ఘనమైన కీర్తికాంక్ష బంధహేతువని ఆత్మ ఎఱుకకు
ప్రతిబంధకమని ఘనంగా చాటిచెప్పిన ఘనాపాటికి వందనం

31. టంకశాలలో ముద్రించిన నాణెంకన్న నీ హృదయంలోనున్న సద్వస్తువును
తెలుసుకోవడం మిన్న అని తేటపర్చిన తేజోమూర్తికి వందనం

32. టాటా చెప్పాలి అరిషడ్వర్గాలకని
శాంతితత్వాన్ని ప్రభోదించిన ప్రేమైకమూర్తికి వందనం

33. ఢాంబికాన్ని వదిలి నిరహంకారంగా ఉండాలని
నిరాడంబరతను నేర్పిన నిరుపమానమూర్తికి నిత్య వందనం

34. తలంపుల సమాహారమే మనస్సని అది హృదయంలో
అణిగిపోతే శాశ్వత శాంతిని పొందగలమని ఎలుగెత్తి చాటిన శాంతిసాగరునికి వందనం

35. దరహాసంతో దప్పికగొన్న భక్తజన బాహుళ్యం
దప్పిక తీర్చిన ధర్మమూర్తికి వందనం

12. ఓర్వలేని గుణం వదిలిపెట్టమని ఓపికగా విశదపర్చిన
 ఓంకారమూర్తికి వందనం అభివందనం

13. ఔపోసన పట్టిన ఉద్గ్రంథాలలోని మాటలను ఉగ్గుపాలవలె
 రంగరించి ఊరడించిన ఉజ్వలమూర్తికి వందనం

14. అందరిలో ఒకరిలా కనిపించే ఈ మాంసనేత్రాలకు
 జ్ఞాననేత్రాలతో లోచూపు నేర్పించే లోకబాంధవునికి వందనం

15. 'అః' అనిపించే రూపలావణ్యంతో అందరి మదిలో నిలిచే
 అద్వితీయమూర్తికి హృదయాభివందనం

16. కన్నవారింటికి వచ్చిన అనుభూతిని పొందేట్లు
 ఆదరించి అభిమానించిన నాన్నగురుదేవులకు వందనం

17. కాకుల వంటి లోకులకు కమనీయమైన మాటలతో
 కాకులను కోకిలలుగా మార్చిన కారుణ్యమూర్తికి వందనం

18. కించిత్ భేషజము లేక క్రిందికి దిగజారే శిష్యరేణువులను
 ఆప్యాయంగా ఆదరించి అక్కున చేర్చుకునే ధీరోదాత్తునికి వందనం

19. క్రీగంటి చూపులతో కన్నీళ్లను కరిగించి
 కలిమిలేములనే భేదంబులేక కడుపార పలకరించే కరుణామయునికి వందనం

20. కృపాకటాక్షాలే గవాక్షాలై కడుజాగరూకతతో
 ఆదరించే కడు రమణీయమూర్తికి వందనం

21. కుందనపు బొమ్మలాంటి మేనిఛాయతో మనో కురూపుల్లాంటి
 మమ్ములను చేరదీసిన ఔన్నత్యమూర్తికి వందనం

22. కూపస్థ మండూకాలను సాగరతీరపుటంచులకు
 చేర్చిన విశాలహృదయునికి వినయపూర్వక వందనం

23. కెరటంలోనున్నది నీరేనని కెరటంగా చూడవద్దని
 ఆత్మనుండి నీవు వేరుకాదని నిశితంగా విశదపర్చిన నిత్యానందమూర్తికి వందనం





తొలగించుకోవటానికి ఏమీ ప్రయత్నం చేయటంలేదు. నైతిక విలువలను పెంచుకోవటంలేదు. ఏది ధర్మం ఏది ధర్మవిరుద్ధం, ఏది జ్ఞానం ఏది జ్ఞానవిరుద్ధం అని చూడటం లేదు. నైతిక విలువలను విడిచిపెట్టి, ధర్మాన్ని విడిచిపెట్టి మనం భక్తిమార్గంలో ప్రయాణం చేస్తున్నాము. ధర్మాన్ని విడిచిపెట్టిన భక్తి రావణాసురుడి భక్తిలాంటిది. అదీ భక్తే కాని అది నరకానికి దారితీస్తుంది. నైతికవిలువలను విడిచిపెట్టి, ధర్మాన్ని విడిచిపెట్టి నేను ఏదో పూజ చేస్తున్నాను, జపం చేస్తున్నాను అంటే మీరు ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రారు, ఇలా మీరు కోటి జన్మలు ఎత్తినా మోక్షసుఖం పొందలేరు.

మన గమ్యం ఏమిటో మనకు తెలియనప్పుడు ఇంక మనకు ఏదీ తెలియనే తెలియదు. మనలో ఉన్న గుణాలను సరిచేసుకోకుండా నేను రామనామం చేస్తున్నాను, కృష్ణనామం చేస్తున్నాను అంటే మనకు మోక్షానికి దారికనబడదు. ముందు మనరోగం ఏమిటో మనం తెలుసుకోవాలి. అందరి హృదయాలలో నేను ఆత్మగా ప్రకాశిస్తున్నాను అని భగవంతుడు చెప్పాడు కదా! భగవంతుడు అబద్ధం చెప్పడు కదా! అయితే భగవంతుడు మీ అందరి హృదయాలలో ప్రకాశిస్తున్నప్పుడు మీ హృదయంలో ఉన్న భగవంతుడు మీకు తెలియకుండా ఏది మీకు అడ్డువస్తోంది? ఆత్మసుఖస్వరూపం, ఆనందస్వరూపం అని చెప్పాడు. ప్రతీ మనిషి సుఖంగా ఉన్నాడా? దుఃఖంగా ఉన్నాడా? ప్రతీ మనిషి దుఃఖపడుతున్నాడు కదా! మీరు పూజలు చేస్తున్నారు, జపాలు చేస్తున్నారు కాని మనలో ఉన్న సుఖం మన చేతికి అందకుండా ఏది మనకు అడ్డువస్తోంది అని ప్రశ్న ఎప్పుడైనా వేసుకున్నారా? ఇది మీరు బాగా ఆలోచించుకోండి. మీకు ఇంటి దగ్గర ఎప్పుడైనా కోపం వస్తోందా? మీకు కోపం వచ్చినప్పుడు ఆ కోపం మీ తెలివితేటలను పాడుచేస్తోందా లేక అది మీ తెలివితేటలను అభివృద్ధి చేస్తోందా? మోక్షం మాట ఒక ప్రక్కన పెట్టండి. నాకు ఉన్న తెలివితేటలను పెంచటానికి నా కోపం ఉపయోగపడుతోందా? అది నా తెలివితేటలను పెంచటంలేదు సరికదా తగ్గించేస్తోంది. కాని నేను ఎందుచేత కోపాన్ని తొలగించుకోలేక పోతున్నాను. మీ కోపం మీకు నష్టం తీసుకొని వస్తోంది. ఏదో నాలుగు రూపాయలు లాభం వస్తే తినగలరు కాని నష్టం వస్తే ఎంతకాలం భరించగలరు. ఇలా నష్టం వచ్చే వ్యాపారం ఎంతకాలం చేస్తారు. నేను పూజ చేస్తే, జపం చేస్తే నాకు జ్ఞానం వచ్చినట్లు కాదు. మీరు అందరూ నన్ను ద్వేషిస్తున్నప్పటికీ మీ మీద నాకు ద్వేషం రాకూడదు. ఏదో అలా నటించటం కాదు. సహజంగా మీమీద నాకు ద్వేషం కలగకుండా ఉంటే అప్పుడు నాకు జ్ఞానం కలిగినట్లు. కోపం వల్ల నేను నష్టపోతుంటే ఆ కోపాన్ని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయటం మానేసి, నేను ఏదో పూజ చేస్తాను అంటే ఆ మాటకు అర్థం ఏమిటి? ఏ

కోపమైతే, ఏ రాగమైతే, ఏ ద్వేషమైతే నా తెలివితేటలను చంపుతోందో ఆ గుణాలను వదులుకోవటం మానేసి నేను పూజచేస్తాను, యాత్రలకు వెళతాను అంటే దానివలన మీకు సుఖం ఏమిటి? శాంతి ఏమిటి?

కొంతమంది రమణమహర్షి భక్తులు, కొంతమంది బాబాకి భక్తులు, కొంతమంది రాముడికి భక్తులు, కొంతమంది శివుడికి భక్తులు ఇలా మనస్సును ఏదో కట్రాడుకు కట్టేసారు. బాగానే ఉంది కాని ఇలా ఏదో ఒక అవతారపురుషుడికి బానిసగా ఉన్నంతమాత్రంచేత మనకు జ్ఞానం వచ్చేస్తుందా? రమణమహర్షి ఇలా చెప్పారు, బాబా ఇలా చెప్పారు, రాముడు ఇలా చెప్పాడు అనుకొన్నంతమాత్రంచేత మనకు జ్ఞానం కలుగుతుందా? నేను చేపే జపం వలన, నేను చేసే సాధనల వలన నాలో ఉన్న దుర్గుణాలు కనుక బయటకు వెళ్ళకపోతే ఏమీ ప్రయోజనం లేదు. మీరు పైకి గౌరవంగా మాట్లాడవచ్చు, లోపల మనస్సులో కుళ్ళు ఉంటే అది నీతి ఎలా అవుతుంది? మనస్సులో కుళ్ళు లేకుండా ఉండి, మీరు పైకి కొంచెం కఠినంగా మాట్లాడినా అదేమి చెడ్డ చెయ్యదు. మీరు ఎంతసేపు లోపల ఏమి జరుగుతోంది అనేది చూసుకోవాలి. మీకు బయట కనిపిస్తున్న ప్రపంచం కంటే లోపల ఉన్న ప్రపంచం ఇంకా పెద్దది. మనకు కళ్ళు ఉన్నాయి అని ప్రపంచంలో ఉన్న చెడ్డ విషయాలను, సినిమాలను చూస్తున్నాము అనుకోండి అవి మన మనస్సును పొల్యూట్ చేస్తాయి. ఈరోజు గడిచిపోతే అయిపోయినట్లు కాదు, ఈ జన్మ గడిచిపోతే వెళ్ళిపోయినట్లుకాదు. ఇప్పుడు మనకు దేహాలు ఎలా ఉన్నాయో అలా భవిష్యత్‌లో కూడా మనకు దేహాలు వస్తాయి. మన ఇంద్రియాల వలన మనకు ఉపకారం జరిగేలా మన కళ్ళను, చెవులను మనం ఉపయోగించుకోవాలి. చెడ్డ పనులు చేయవద్దు అని మన పెద్దలు చెప్పారు ఎందుచేతనంటే చెడ్డ పనులు మనకు దుఃఖాన్ని తీసుకొనివస్తాయి. మంచి పనులు చేయమని చెప్పారు దానికి కారణం మంచి పనులు మనకు సుఖాన్ని తీసుకొనివస్తాయి. ఏ గుణాల వలన మన శారీరకఆరోగ్యం చెడిపోతుందో, ఏ గుణాల వలన మన మనస్సుకు అశాంతి వస్తుందో ఆ గుణాలను విడిచి పెట్టకపోతే అసలు మనకు భక్తి లేదు అని అర్థం.

మీ ఇంటికి ధనం వస్తుందంటే సంతోషిస్తారు కాని దరిద్రం వస్తుందంటే కంగారు పడతారు, చావు వస్తోందంటే మరీ కంగారు పడతారు. మనం దరిద్రానికి ఎక్కువ కంగారు పడనక్కరలేదు, చావుకీ ఎక్కువ కంగారు పడనక్కరలేదు. మనలో ఉన్న అహంకారానికే ఎక్కువ కంగారుపడాలి. ఎందుచేతనంటే నా అహంకారం నాకు చేస్తున్నంత అపకారం, దారిద్ర్యమూ చేయదు, చావూ చెయ్యదు. కాని నేను నా అహంకారాన్ని అలా పదిలం చేసుకొంటున్నాను, చావుకు, దారిద్ర్యానికి జడుస్తున్నాను. అందరూ నేను, నేను అంటున్నాము





# శ్రీ నాన్నగీతం

1. అందరి మదిలో అనురాగాన్ని నింపి<br>అలజడులను పారదోలిన అపురూపమూర్తికి వందనం
2. ఆత్మబంధువుల్లారా అనే సంబోధనతో భక్తులలో<br>ఆత్మీయతను నింపిన ఆత్మజ్ఞానికి వందనం
3. ఇహలోక ఇక్కట్లను పారద్రోలి<br>పరమానందాన్ని పంచిపెట్టిన పావనమూర్తికి వందనం
4. ఈ జన్మ పరమార్థాన్ని విపులంగా విశదపర్చి<br>మా హృదయాలలో పదిలపర్చిన పవిత్రమూర్తికి వందనం
5. ఉనికిలేని మనస్సును పదునైన మాటలతో పలుచన చేసి<br>పారవశ్యం నింపిన సుగుణాభి రామునికి పాదాభివందనం
6. ఊయలలో పిల్లవాడికి జోలపాడి నిద్రపుచ్చే తల్లిలా<br>ఊరటనిచ్చే మాటలతో బాధలను మైమరపించే భానుమూర్తికి వందనం
7. ఋగ్వేదం నుండి ఋషుల వరకు, సామవేదం నుండి సన్యాసుల వరకు<br>కోకొల్లలుగా ఉదాహరణలతో జ్ఞానాన్ని పంచిపెట్టిన జ్ఞానమూర్తికి వందనం
8. ఎందరో పామరులకు విషయ జ్ఞానాన్ని ఎరుకపర్చి<br>ఎదలో, మదిలో మలిన పొరలను తొలగించిన మందహాసమూర్తికి వందనం
9. ఏసుక్రీస్తు నుండి సోక్రటీసు వరకు, తులసీదాసు నుండి గాంధీజీ వరకు<br>సద్గుణాలను తెలియజెప్పి జీవన్ముక్తులను చేయగోరే గురుదేవులకు వందనం
10. 'ఐ'ని వదలమని అదే అన్ని బంధాలకు మూలమని<br>ముముక్షువులకు ముచ్చటగొలిపే మాటలతో విశదపర్చిన విశ్వమూర్తికి వందనం
11. ఒదిగే గుణం, సహనం జ్ఞానమార్గానికి తొలిమెట్టని అవినయం, అసహనంతో<br>స్వస్వరూపానికి దూరమౌతారని అతిసరళంగా ఎరుకపర్చిన గుణసాగరునికి వందనం

కేవలం ధనమే ఎవ్వరినీ సంపన్నుని చేయదు. వినమ్రత, స్వచ్ఛమైన మనస్సు ఇవే మనిషిని సంపన్నుని చేస్తాయి. బుట్టలోని రసాలు పైకి ఎంత బాగా కనబడినా, అవి లోపల పాడైపోయి ఉంటే ఎందుకూ పనికిరావు. లోపల తీపిదనముంటేనే మామిడిపళ్లు రుచిగా ఉంటాయి.

ఎవరికైనా సహాయం చేస్తే అది ఇంకొకరికి మనం చేసిన ఘనకార్యంగా అనుకో కూడదు. ఆ కాస్త ఉపకృతే ఘనకార్యమనుకుంటుంది మనస్సు వెంటనే. ఇతరులకు సహాయాన్ని శక్తివంచన లేకుండా చెయ్యాలి. నీకీ అవకాశం భగవంతుడివ్వడంలో ఉద్దేశం నీ మనస్సు నిర్మలమవడానికే అని గుర్తుంచుకో. అంటే కుడి చేతితో ఇచ్చి, ఎడమ చేతితో తీసుకోవడం వంటిదే ఇది. అటువంటప్పుడు 'ఉపకృతి' అనే మాట ఎట్లా వస్తుంది - రెండు చేతులూ నీవే కదా!

ఆధ్యాత్మిక ప్రస్థానంలో, ప్రపంచం పట్ల మమకారముండటమే గొప్ప అవరోధం. మమతారహితంగా ఉండేట్టుగా మనస్సుని తర్ఫీదు చేయమంటారు నాన్నగారు. ఆ మమకారాన్ని అంతరంగంలోకి తీసుకువెళ్లి ఆ శాంతి సాగరాన్ని అనుభవించమంటారు.

ఆత్మాన్వేషణలో నిలకడగా నిలవడానికి మన దృక్పథంలో మార్పు రావాలంటారు. అందువల్ల ప్రథమంగా మనం చేయవలసింది మన దృక్పథంలో మార్పు తెచ్చుకోవడం. జ్ఞానమూ, వినయము, సేవాభావము లేకపోతే ఎవ్వరిలోనూ మార్పు తీసుకురావడం కుదరదంటారు నాన్నగారు. ఇతరుల వికాసానికి ఎన్నో అవకాశాలివ్వవచ్చు కాని ఆ వ్యక్తిలో మార్పుని బలవంతంగా తీసుకురాలేము. 'మారాలి' అనే భావన లోపల నుంచి రావాలి. అట్లాగే పరమాత్మ గురించి తెలుసుకోవాలనే కోర్కె కూడా లోపల నుంచే రావాలి.

**నాన్నగారి అమృత వాక్కులివి :**

- నీ హృదయంలోని సత్యాన్ని గ్రహించడమే జీవిత లక్ష్యం.
- ఆత్మ సాక్షాత్కారమయ్యే వరకూ నిన్ను మాయ వెంటాడుతూనే ఉంటుంది.
- అసలైన సంతోషం నీలోనే ఉంది. బయటి నుంచి రాదు. ఈ విషయం గ్రహించడమే పరమ జ్ఞానానికి బాట అవుతుంది.
- ధనంతోబాటు, మేధా సంపత్తి కూడా ఎక్కువ అవుతుండాలి. కేవలం ధనమే ఎక్కువైతే అది ప్రమాదకరమవుతుంది.
- గురువుకిగాని, దైవానికిగాని శరణాగతి చెందడమే పరిపూర్ణమైన శరణాగతి. ఈ ప్రపత్తే అసలైన ప్రార్థన.
- మనమేరంగంలో ఉన్నా గుర్తింపుకోసం ప్రాకులాడకూడదు. ఆ గుర్తింపు తనంతట తానే లభిస్తే మనల్ని పరిమితం చేయదు. ఖ్యాతికోసం ప్రాకులాడటమే నిన్ను బంధీని చేస్తుంది.





కదా! ఈ నేనే మనస్సు. దానిని జయించిన వాడికి కాని జ్ఞానం కలుగదు. ఏ మాటల వలన మీకు హితవు కలుగుతుందో, మేలు కలుగుతుందో ఆ మాటలనే చెప్పాలని ఉంది కాని మిమ్మల్ని సంతోషపెట్టే మాటలు, మిమ్మల్ని పొగిడే మాటలు నాకు చెప్పాలని లేదు. మాకు మోక్షం కావాలి, ఇంకేమి అక్కరలేదు అంటారు కదా! మనం నేను, నేను అంటున్నాము కదా! ఈ తింగర నేనుకు మోక్షమా? ఈ నేనుకు మోక్షం కాదు. ఈ నేనును విడిచిపెట్టటమే మోక్షం. ఇప్పుడు మనం అనుకొనే నేనును విడిచిపెట్టటమే మోక్షం. దానిని విడిచిపెట్టటానికి మనలో ఎవరైనా సిద్ధంగా ఉన్నారా? ఒక రహస్యం చెపుతాను మీరు ఎక్కడా చెప్పకండి. మీరు రామాయణం, భారతం, భాగవతం చదువుతున్నారు, అందులో రావణాసురుడు, దుర్యోధనుడు, కంసుడు వీళ్లందరూ రాక్షసులు అనుకొంటున్నారు. అసలు యదార్థం చెప్పాలంటే ఈ నేనే రాక్షసుడు. మనం నేను, నేను అంటున్నాము కదా, ఈ నేనే రాక్షసుడు. కొన్నివేలమంది రాక్షసులు కలిసి చెయ్యలేని చెడ్డ ఈ నేను చేస్తుంది. బయట రాక్షసులు కేవలం మన శరీరాన్ని చంపగలరు కాని ఈ నేను నిరంతరం నీకు సుఖం లేకుండా చేసేస్తుంది. మన దుఃఖానికి ఈ నేనే కారణం. ఈ నేనే నిజమైన రాక్షసుడు. ఈ నేను అనే రాక్షసుడిని లోపలపెట్టుకొని మనం భక్తి అభివృద్ధి చేసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాము. వాడు ఏమి చేస్తాడు అంటే ఇతరులలో ఉన్న తప్పులు, బలహీనతలు వెదకమంటాడు కాని వాడెంత రాక్షసుడో మనకు చెప్పడు. శాంతి, సుఖం సహజంగా మనలో ఉన్నాయి. అయితే అవి మనకు అనుభవంలోనికి రాకుండా ఈ నేను అనే రాక్షసుడే మనకు అడ్డువస్తున్నాడు. వీడే నరకాసురుడు. ఈ నరకాసురుడిని చంపినప్పడే మనకు నిజమైన దీపావళి.

మన దుఃఖానికి ఏనేను అయితే కారణమో దానిని తొలగించుకోవటానికి మనం ఏమీ ప్రయత్నం చేయటంలేదు. పైగా దానిని అలంకరిస్తున్నాము, దానిని సింహాసనం మీద కూర్చోబెడుతున్నాము. ఈ నేను అనే అహంకారం అభివృద్ధిఅయ్యేలా మాట్లాడుతున్నాము. లక్ష రూపాయలు ఖర్చుపెట్టి ఈ నోము నోచుకోండి, ఈ వ్రతం చేయండి అంటే డబ్బు ఖర్చు పెట్టి చేస్తున్నాము. మీరు ఏమీ కష్టపడవద్దు, ఈ నేనును అలంకరించటం మానేయండి అంటే మీరు మానటంలేదు. మీరు చేసే పనులు జ్ఞానం కోసం చేస్తున్నారా లేక అహంకారాన్ని సంతృప్తి పరచటం కోసం చేస్తున్నారా? జ్ఞానంకోసం మీరు పనిచేస్తే అది సత్కర్మ అవుతుంది, అహంకారాన్ని పెంచుకోవటం కోసం పనిచేస్తే అది దుష్టకర్మ అవుతుంది. మీలో ఎవరికైనా కేన్సర్ జబ్బు ఉన్నా కంగారుపడవద్దు. కేన్సర్ నిజమైన జబ్బుకాదు, నిజమైన జబ్బు ద్వేషం. కేన్సర్ ఈ దేహాన్ని తీసుకొనిపోతుంది అంతేగాని ద్వేషం మిమ్మల్ని శాశ్వతమైన నరకంలోనికి తీసుకొనిపోతుంది. మీకు కేన్సర్ ఉంటే హాస్పటల్‌కు వెళ్లి తగ్గించుకోవటం కోసం వేలాది

రూపాయలు ఖర్చు పెడుతున్నారు కదా! మీలో ఎవరికైనా ద్వేషం ఉంది అనుకోండి, అసూయ ఉంది అనుకోండి, కోపం ఉంది అనుకోండి ఈ ద్వేషం అనే రోగాన్ని, కోపం అనే రోగాన్ని తగ్గించుకోవటానికి ఏ హాస్పటల్‌కు వెళుతున్నారు? మీలో ఉన్న దుర్గుణాలు కూడా రోగాలే కదా, ఆ రోగాలను తొలగించుకోవటానికి మీరు చేసే సాధన ఏమిటి? మీరు చేసే ప్రయత్నం ఏమిటి? మీరు పెట్టే పెట్టుబడి ఏమిటి? మీరు రోజూ దేవుడికి పూజ చేస్తున్నారు, బాగానే ఉంది. మీలో ఉన్న ద్వేషాన్ని, అసూయను బయటకు గెంటటానికి ఆ దేవుడు ఉపయోగపడటం లేదు అనుకోండి, ఆ దేవుడిని ఏమి చేసుకుంటారు? ఆ దేవుడి వలన మీకు ఉపయోగం ఏమిటి అని అడుగుతున్నాను? నేను చెప్పే ఈ మాటలు ఒకవేళ తాత్కాలికంగా మీకు నచ్చకపోయినా, ఏమో ఎప్పుడైనా ఇంకో పది సంవత్సరాలకైనా ఈ మాటలు మీకు గుర్తొస్తాయని, మీకు ఉపయోగపడతాయని చెపుతున్నాను.

నా చొక్కామీద చీమ పాకుతోంది అనుకోండి. మీ చొక్కా మీద చీమ పాకుతోంది, తీసేసుకోండి అని చెప్తే నాకు కోపం రాదు. లేకపోతే మీ నెత్తిమీద బాడి ఉందండి దానిని కడిగేసుకోండి అని ఎవరైనా చెపితే నాకు కోపం రాదు. కాని మీ మనస్సులో ఫలానా దోషం ఉంది దానిని తొలగించుకోమని ఎవరైనా చెపితే నాకు కోపం వస్తుంది. శరీరం మీద ఉన్న మట్టిని తీసుకోమంటే నాకు కోపం రావటంలేదు, మనస్సులో దోషరూపంలో ఉన్న మట్టిని తీసుకోమంటే నాకు కోపం వస్తోంది. దీనికి కోపం రాదు మరి దానికి ఎందుకు కోపం వస్తోంది, అసలు లోపం ఎక్కడ ఉంది? అంటే నా అహంకారముతోటి నేను కలిసి ఉంటున్నాను. దానితో ఐడెంటిఫై అవ్వటం వలన అప్పుడు కోపం పుడుతోంది. నన్ను ఎవరు బంధిస్తున్నారు? మీరు నన్ను బంధించటంలేదు. నా మనస్సే నన్ను బంధిస్తోంది. నీ మనస్సే నిన్ను బంధిస్తూ ఉంటే దానిని తొలగించుకోవటానికి నీవు చేసే ప్రయత్నం ఏమిటి? నీ మనస్సును స్వాధీనం చేసుకొంటే అది నీకు స్నేహితుడిలాగ ఉపకారం చేస్తుంది, నీ మనస్సును స్వాధీనం చేసుకోలేకపోతే విరోధి నీకు ఎంత అపకారం చేస్తాడో నీ మనస్సు అంత అపకారం చేస్తుంది అని భగవంతుడు చెప్పాడు. దేహాన్ని కాల్చటానికి రెండు మూడు వందలు ఖర్చు అవుతుంది. దానితో నీ మనస్సు కాలుతుందా? పోనీ వెయ్యి రూపాయలు పెట్టి పుల్ల కొనేద్దాము అప్పుడు నీ మనస్సు కాలుతుందా అంటే కాలదు. శరీరం కాలకముందే ఎవడైతే తన మనస్సును కాల్చుకొన్నాడో వాడే సిద్ధపురుషుడు. అంటే శరీరం ఈ భూమి మీద ఉండగానే మనస్సు కాలిబూడిద అయిపోవాలి.

కొంతమంది మంచి మాటలు వినరు. దానికి కారణం లోపల ఉన్న దోషం విననివ్వదు. మనలో ఉన్న దోషం వలన దేవుడు లేడు అనుకొంటున్నాము. నిజం చెప్పాలి





నరసింహరాజు గారు 1934లో పశ్చిమ గోదావరి జిల్లా కొమ్మర గ్రామంలో జన్మించారు. ఆయనని అందరూ ఆప్యాయంగా 'నాన్నగారు' అంటారు. జిన్నూరుని తమ నివాసంగా ఎంచుకొని దాదాపు ఏభై సంవత్సరాలపైగా భగవాన్ రమణమహర్షి బోధనలను అందరికీ అందిస్తున్నారు. తమ కోమలత్వంతో, నిరాడంబరతతో, మౌనంతో అందరికీ ప్రీతి పాత్రులయ్యారు నాన్నగారు.

'నాన్నగారు' అన్న పిలుపే చాలు - ఆయనకీ, భక్తులకీ బంధం పెరగడానికి. ఎప్పుడూ తెల్లని బట్టలనే ధరిస్తుండే నాన్నగారిని దర్శించుకోవడమే డస్సిపోయిన దేహమూ, మనస్సు చేయవలసింది. ఈ సమాగమమే జీవితం పట్ల మన దృక్పథాన్ని మార్చేస్తుంది. అందరికీ సులభులు నాన్నగారు. మన వర్తమాన జీవితం మన పూర్వకృత కర్మల ఫలితమని నాన్నగారు స్పష్టంగా చెప్తారు. గతించిన కర్మల గురించి మనం చేయగలిగిందేమీ లేదు. ఆయన మార్గదర్శకత్వం వల్ల మన భవిష్యత్తు తప్పకుండా మెరుగవుతుంది. ఆయన భాష సరళం. ఆయన ఇచ్చే సలహా జ్ఞానమయ గుళిక.

ఆయన శ్రీ రామకృష్ణ పరమహంస గురించిగానీ, వివేకానందుల గురించిగాని మాట్లాడేటప్పుడు ఆయా మూర్తులు తానే అయిపోతారు. శ్రీరామకృష్ణుని గురించి చెప్పేటప్పుడు పరమహంస పాటలూ, అనుభవాలూ, బోధలూ మనకెంతో స్పష్టంగా తెలియజేస్తారు. మనం ఆ వెనుకటి కాలానికి వెళ్ళిపోయినట్టూ మనకి శ్రీరామకృష్ణులు ప్రత్యక్షమై మన ఎదుట ఆసీనులైనట్టూ అనుభూతి కలుగుతుంది. అదేవిధంగా ఉత్తేజపరిచే వివేకానందుల ఉపన్యాసాలను - ముఖ్యంగా పాశ్చాత్యులకు వేదాంతాన్ని వివరించే వాటిని - చెప్తున్నప్పుడు నాన్నగారు వివేకానందులే అయిపోతారు. గౌతమబుద్ధుని జీవిత వృత్తాంతాలూ, ఆనందునికి ఇచ్చిన బోధలూ చెప్పేటప్పుడు కూడా అలాగే బుద్ధుడే అయిపోతారు.

నాన్నగారి ఉద్దేశంలో అసలైన గురువెవ్వరూ గుర్తింపుకోసం ప్రాకులాడడు. మనిషిలో పరివర్తన తీసుకురావడానికే గురువు ప్రయత్నిస్తాడు. తనపట్ల భక్తుడు లగ్నమయ్యేట్లు చేస్తాడు. మనతోనే మసలుతు గురువు మనలో మార్పును తీసుకువస్తాడు. తన వర్తనం వల్ల మనకొక మార్గదర్శకుడవుతారు.

గుర్తింపుకోసం తాపత్రయపడవద్దని పదేపదే చెప్తుంటారు నాన్నగారు. ఏ పనినైనా చేసేటప్పుడు దృష్టి అంతా ఆ పనిని పూర్తి చేయటంపైనే ఉండాలిగాని, ఆ పనివల్ల కలిగే ఫలితాల మీద ఉండకూడదంటారు. సక్రమంగా పని పూర్తయితే గుర్తింపు తనంతట తానే లభిస్తుందంటారు.

ధనం సంతోషాన్ని ఎప్పుడూ కలిగించదంటారు నాన్నగారు. నిర్మలమైన మనస్సు ఎంతో సంతోషాన్నిస్తుందంటారు. ఉన్న సంపద గురించి ఏ ఆర్భాటమూ చేయవద్దంటారు.

# శాంతి సాగరం - (జిన్నూరు) నాన్నగారు

**తెలుగు అనువాదం : శ్రీ పింగళి సూర్య సుందరం**

**ఆంగ్ల మూలం : శ్రీమతి అంబికా ఉదయ నారాయణ్**

విస్తృతమైన సాగరం పైకి ఎంతో ప్రశాంతంగా ఉన్నట్టు కనబడుతుంది. వర్షాకాలపు నీళ్ళతో నిండి ప్రవహిస్తూ వచ్చే నదులు ఆ సాగరంలో కలసినా, వేసవిలో ఒక చుక్క నీరు కలవకపోయినా సాగరం ప్రశాంతంగానే ఉంటుంది. ఆ సాగరపు అగాధాలలో దాగి వున్నాయి అసలైన సిరులన్నీ. అసంఖ్యాకమైన జీవరాశులకి ఆలవాలం సాగరం, రత్నాలకీ ఇంకా ఎన్నిటికో కూడ సాగరం నిలయమే.

సాగరం వలెనే సద్గురువు కూడ ప్రశాంతుడే, తనకు గల జ్ఞానాన్ని ప్రదర్శించడానికి ఏ ప్రయత్నమూ చేయకుండా మిగిలిన వాళ్ళతో బాటే ఆయన నవ్వుతారు, మాట్లాడతారు, వింటారు. ఎప్పుడూ అప్రమత్తంగానే ఉంటూ, నీ జీవిత గమ్యాన్ని నీవు చేరడానికి నీతో సహకరిస్తూనే ఉంటారు.

సద్గురు నాన్నగారు శాంతి సాగరం. అపురూపమైన రత్నం. ఆయన్ని దర్శించడమన్నా, ఆయన మాటలని వినడమన్నా మన భాగ్యమే. అనంతమైన ఆనందాన్ని ఆయన అనుభవ సిద్ధం చేసుకున్నారు. కాని దాని గురించి ఏ ఆర్భాటమూ చేయరు. మనం గ్రహించాల్సిన సిరి అంతా ఆయన మౌన లోతుల్లోనే ఉన్నది.

ఆయన మౌనం మన చెవుల్లో మార్మోగుతుంది. మన ఆలోచనలన్నిటినీ తీసేసి మనల్ని శాంతపరచే శక్తి ఉంది. దానికి ఆయన కరుణామయ వీక్షణం, బాధాతప్తమైన మన మనస్సులను శాంతపరుస్తుంది. ఒక్క చూపుతో మన గతం, భవితవ్యం ఆయన గ్రహిస్తారు. ఆయన వద్ద నుండి దేనినీ దాచలేము. ఆయన కళ్ళు అన్నిటినీ చూడగలవు. ధనికులైనా, నిరుపేదలైనా అందరూ ఆయనకి సమానులే. తమ వ్యాపారం గురించో, విద్య గురించో, వివాహం గురించో, ఉద్యోగం గురించో, ఆయన సలహాని కోరుతూ వస్తారెందరో. అందరికీ సముచితమైన సలహాలిస్తారు. ఎవ్వరూ రిక్త హస్తాలతో తిరిగిపోరు. ఇవన్నీ జరుగుతున్నా ఆయనలో ప్రశాంతత చెక్కు చెదరదు.

ఆయనని ఆశ్రయించిన వారంతా అదృష్టవంతులే. జీవిత లక్ష్యాన్ని చేరుకోవడానికి ఆయన బోధించే మార్గం సరళమైనది. ఉపవాసాలు చేయమని గానీ, ధ్యానం చేయమని గానీ, క్రతువులు చేయమని గానీ ఆయనేమీ చెప్పరు. నీ మనస్సులో మెదిలే ఆలోచనలని గమనించమని సరళమైన భాషలో చెప్తారు.

భగవాన్ రమణుల స్వప్న దర్శనమైంది నాన్నగారికి. శ్రీ భూపతిరాజు వెంకట లక్ష్మీ





అంటే దేవుడు ఉన్నాడు, మనం లేము. కాని మనం అనుకొనేది ఏమిటి అంటే మనం ఉన్నాము దేవుడు లేడు అనుకొంటున్నాము. మీరు ఎన్ని విద్యలు నేర్చుకోండి, ఎంత కీర్తి సంపాదించండి, మీరు ఎవరో మీకు తెలియనప్పుడు ఏమీ తెలియనట్లే లెక్క. నేను ఎవరో నాకు తెలియనప్పుడు నాకు ఎంత విజ్ఞానం ఉన్నా ఏమిటి ప్రయోజనం? ఇంటి నిండా బియ్యం ఉన్నాయి, నాకు ఒక్క మెతుకు కూడా అరగదు అనుకోండి, ఆ బియ్యంవల్ల మీకు ఏమిటి ఉపకారం. నాకు ఎన్ని విషయాలు తెలిసినప్పటికీ, ఎన్ని శాస్త్రాలు నా చేతిలో ఉన్నప్పటికీ, నేను ఎవడో నాకు తెలియనప్పుడు నాకు సుఖం లేదు. మీకు ఏమీ తెలియదని అంటే మీరు ఊరుకుంటారా? మీకు అన్నీ తెలుసును అంటే మీరు సంతోషిస్తారు. నాకు ఒకే విషయం తెలుసు అన్నాడు సోక్రటీసు. నాకు ఏమీ తెలియదన్న సంగతి నాకు తెలుసు అని చెప్పాడు. మీకు చాలా విషయాలు తెలుసును అనుకోండి. మీరు ఎవరో మీరు తెలుసుకోవటానికి ఆ విషయాలు సహాయపడనప్పుడు వాటినేమి చేసుకొంటారు, పొయ్యిలో పెట్టి కాల్చుకోవాలి అంతే.

రోజూ పది నిమిషాలు ఏకాంతంగా కూర్చోండి అంటే ఒంటరిగా ఉండలేము అంటారు. మరి చనిపోయినప్పుడు మీకూడా ఎవరు ప్రయాణం చేస్తారు. ఇప్పుడు ఏకాంతంగా ఉండటం ఎవరికీ ఇష్టంలేదు మరి మరణించాక మనకు ఎవరు సహాయం చేస్తారు, మన జతగాళ్ళు ఎవరైనా మన కూడా వస్తారా? ఈ దేహం పుట్టినప్పుడు నేను పుట్టాను అనుకొంటున్నాను, ఈ దేహం మరణించినప్పుడు నేను మరణించాను అనుకొంటున్నాను. మీరు ఏ దేవుడిని ఆరాధించినా, మీరు ఏ మతంలో ఉన్నా మీరు ఏ గురువును ఆశ్రయించినా మీ మనస్సు యొక్క జన్మస్థానం మీరు చూసేవరకు మీరు జ్ఞాని కాలేరు. ఇది సుప్రీమ్‌కోర్టు జడ్జిమెంట్.

**యో న హృష్యతి న ద్వేష్టి నశోచతి న కాంక్షతి**

**శుభాశుభపరిత్యాగీ భక్తిమాన్ యస్సమే ప్రియః**

ఎవడైతే అనుకూల విషయాలు జరిగినప్పుడు పొంగిపోడో, ఎవడికైతే ద్వేషం లేదో, ఎవడికైతే దుఃఖంలేదో, ఎవడైతే దేనిని కోరడో, ఎవడైతే శుభాన్ని, అశుభాన్ని విడిచిపెడు తున్నాడో అటువంటి భక్తుడు నాకు ప్రియుడు అని పరమాత్మ చెపుతున్నాడు. మనకు అనుకూలమైన విషయాలు జరిగితే సంతోషం వస్తుంది, మిమ్మల్ని ఎవరైనా పొగిడితే మీకు సంతోషం వస్తుంది. మీ లోపల ఉండి అసలు ఆ పొగిడేవాడు ఎవడు? ఇక్కడ సంతోషించే వాడు ఎవడు? ఇదే మాయ. ఇది మనం అర్థం చేసుకోవాలి. ప్రతీవాడు శుభాన్ని

కోరుకుంటాడు, అశుభం రాకూడదు అనుకుంటాడు. శుభాన్ని కోరుకునే ప్రతీవాడికి మనిషి వెంట నీడవచ్చినట్లు శుభంవెనుక అశుభం తప్పనిసరిగా వచ్చి తీరుతుంది, మీరు అశుభాన్ని కోరుకోనక్కరలేదు. ఎప్పుడైతే శుభాన్ని కోరుకున్నారో అప్పుడు అశుభం వచ్చితీరుతుంది. శరీరం ఎప్పుడైతే పుట్టిందో అప్పుడు మరణం తప్పక వస్తుంది. పోనీ మీకు ఆదివారం రావచ్చు, నాకు సోమవారం రావచ్చు, ఏదోరోజు మరణం తప్పదు. మనం ప్లాన్ వేసుకోవచ్చు కానీ జరిగేది ఈశ్వరుడి ప్లాన్. మనం ఏవో మాటలు చెప్పకోవటంకాని మనస్సు ఉన్నంతసేపు ప్లాన్లు వేయటం ఎవరు మానతారు. అనుకోవటం మన చేతిలో ఉంది కాని జరిగేది ఈశ్వరసంకల్పం. మనసంకల్పం ఈశ్వరసంకల్పం రెండూ కలుస్తాయి అనుకోండి అప్పుడు మనం అనుకొన్నది జరిగిపోయింది అనుకొంటాము, మన తెలివితేటలు అనుకొంటాము. కాని మనం అనుకొన్నది జరగలేదు, అప్పుడు కూడా ఈశ్వరుడు అనుకొన్నదే జరిగింది. మనం అనుకొన్నది జరిగితే ప్రతీదీ జరగాలి కదా! ఇది బాగా అర్థం చేసుకోండి.

మరణం వచ్చినప్పుడు మనకు ముందు చెప్పిరాదు. నాలుగు రోజులు ముందు నోటీసు ఇచ్చి తరువాత రాదు అలా నోటీసు ఇచ్చి వస్తే మనం అన్నీ సర్దుకోవచ్చు. మనం వినే విషయాలపట్ల, చూసే విషయాలపట్ల జాగ్రత్తగా ఉండాలని ఆచార్యులవారు చెప్పారు. అలా ఎందుకు చెప్పారు అంటే ఒకసారి మనం వింటే, ఒకసారి మనం చూస్తే ఆ విన్న విషయం, చూసిన విషయం అది మంచిది అయినా, చెడ్డది అయినా మరణసమయంలో జ్ఞాపకం వస్తుంది. ప్రతీ మనిషికి మరణసమయం పరీక్ష లాంటిది. శవం శవం అంటే ఎక్కడ నుండి వస్తుంది, ఈ శరీరమే శవం, ముక్కులో గాలి ఆగిపోతే దీనినే శవం అంటారు. ఇప్పుడు మనం తిరుగుతున్నాము కాబట్టి దీనిని శవం అనటంలేదు కాని ఇది శవమే. మరణసమయంలో ఈ మనస్సు ఏమి చేస్తుంది అంటే మనం జీవితంలో విన్న విషయాలను, చూసిన విషయాలను, చేతులతో చేసిన పనులను, మనం ఆలోచించిన విషయాలను మొత్తం అన్నీ కూడా స్మరిస్తుంది, ఈ గొడవలన్నీ సర్దుకొంటుంది. తరువాత ప్రాణం శరీరాన్ని విడిచిపోతుంది. అప్పటివరకు మనం ఎంత కంగారుపడ్డా ప్రాణం శరీరాన్ని విడిచిపెట్టదు. చావు అంటే అందరు కంగారుపడుతున్నారు. మనం ఎక్కడికి వెళ్ళటంలేదు. ఇది టెంపరరీ నిద్ర. సినిమాలో కాఫీ తాగటానికి ఇంటర్‌వెల్ ఇస్తారు కదా అలాగ చావు అనేది ఈ శరీరానికి ఇంకో శరీరానికి మధ్య ఇంటర్వెల్ అన్నమాట. మీరు తినే తిండి విషయంలో ఎంత జాగ్రత్తపడుతున్నారో అలాగే మీరు చూసే విషయాలలో, వినే విషయాలలో కూడా అంతే జాగ్రత్తగా ఉండాలి. అది కూడా ఆహారమే. మీరు తినే తిండి మీ శరీరానికి ఆహారం అయితే మీరు చూసే విషయాలు, వినే విషయాలు మీ మనస్సుకు ఆహారం. మనం తినే





అప్పుడు భగవంతుడు మీ హృదయంలో ఆత్మగా ఎలా ప్రకాశిస్తున్నాడో మీకే తెలుస్తుంది, ఆ రుచి మీకే తెలుస్తుంది, ఈశ్వరుడి యొక్క తేజస్సు ఎలా ఉందో మీకే తెలుస్తుంది. మీ ఇంద్రియాలు కదపకండి. మనస్సుతో మీ హృదయంలోనికి ఒక్క అంగుళం దిగటానికి ప్రయత్నం చెయ్యండి. మీరు ఎలా కూర్చున్నారో అలాగే కూర్చోండి, పెద్ద శ్రమ పడనక్కరలేదు కాని ఒక్క అంగుళం లోపలకు వెళ్ళటానికి ప్రయత్నం చెయ్యండి. మీ హృదయంలో ప్రకాశిస్తున్న పరమేశ్వరుడిని తెలుసుకోవటానికి ఒక్క అంగుళం లోపలకు దిగలేరా? వంద సంవత్సరాలు జీవించి ఒక్క అంగుళం లోపలకు దిగకుండానే ఈ శరీరం విడిచిపెట్టేస్తారా? జ్ఞానాన్ని సంపాదించకుండా ఈ శరీరాన్ని విడిచిపెట్టేస్తే ఇంక సాధించింది ఏముంది? నా శరీరమే నా కూడా రానప్పుడు ఈ శరీరంతో సంపాదించినవి నా కూడా ఎలా వస్తాయి. నేను జాగ్రత్తగా పెంచి పోషించుకొన్న నా శరీరమే మరణానంతరం నా కూడా రానప్పుడు మీరెలా వస్తారు నా కూడా? ఎవడైతే తనని తాను తెలుసుకొన్నాడో వాడే జ్ఞాని. ఎవడైతే తన స్వరూపంగా ప్రకాశిస్తున్న ఆత్మను తెలుసుకొన్నాడో వాడే జ్ఞాని, ఎవడైతే తనను తాను తెలుసుకోలేడో వాడు బాహ్యంగా ఎన్ని తెలుసుకొన్నా వాడు అజ్ఞాని. అందుచేత జ్ఞానాన్ని పొందకుండా ఈ శరీరాన్ని కనుక విడిచిపెడితే మరి ఈ శరీరం ఎందుకు వచ్చినట్లు? ఈ జన్మ యొక్క ఫలితం ఏమి సాధించినట్లు? జ్ఞానాన్ని పొందకుండా నువ్వు ఎన్ని సాధించినప్పటికీ అవి అన్నీ ఒకటిలేని సున్నలు. మీరు డబ్బు సంపాదించవచ్చు, ఆస్తులు సంపాదించవచ్చు, ఐశ్వర్యాన్ని పెంచుకోవచ్చు, జ్ఞానం లేకుండా ఇవి మటుకే సంపాదించి మీరు శరీరాన్ని విడిచిపెడితే ఇవన్నీ ఒకటి లేని సున్నలతో సమానము. మనం కళ్ళు ఉండి చూడలేకపోతున్నాము, చెవులు ఉండి వినలేకపోతున్నాము. ఇప్పుడు నేను కొన్ని మాటలు చెప్పాను కదా. అన్ని మాటలను మీరు ఇంటికి మోసుకొని వెళ్ళవద్దు. ఇవి మొత్తం మీకు బరువు అవుతాయి. మీకు నచ్చిన మాట ఒకటి భుజాన వేసుకోండి. మొత్తం అన్నీ వద్దు ఇక్కడే వదిలేయండి. మీకు నచ్చిన మాటను మీ కొంగుకు కట్టుకొని ఇంటికి పట్టుకొనివెళ్ళండి. ఆ ఒక్కమాటను మీరు జీవితంలో ప్రాక్టీసు చెయ్యండి. డాక్టర్ మెడిసిన్‌ను ఎలా ప్రాక్టీసు చేస్తాడో, లాయర్ లాను ఎలా ప్రాక్టీసు చేస్తాడో అలా మీకు నచ్చిన మాటను, మీరు మెచ్చిన మాటను మీరు ఆచరణలో పెట్టండి అప్పుడు మీకు జ్ఞానం వచ్చేస్తుంది. మీ మనవలను జ్ఞాపకం ఉంచుకోమని నేను మీకు చెప్పాలా? అది చెప్పనక్కరలేదు. కాని దేవుడిని జ్ఞాపకం ఉంచుకోమని చెప్పాలి ఇది ఏమి న్యాయంగా ఉందండీ. మీకు ఇష్టంలేనిది తినవద్దు, మీకు హితవైనదే తినండి. మీకు నచ్చని మాటలు ఇక్కడే వదిలేయండి, నచ్చిన మాట ఒకటి తీసుకోండి, ఆ మాటను మీరు ఆచరణలో పెట్టండి, దానిని మననం చెయ్యండి.

ఉంటే ఈ జననమరణ చక్రంలోనుండి, ప్రకృతి గొడవలలోనుండి, మాయ అనే జైలు నుండి నిన్ను బయటకు తీసుకొనివచ్చి మోక్షం ప్రసాదిస్తాను అంటున్నాడు పరమాత్మ, భగవంతుడు చెప్పిన అభిప్రాయంతో మీ భావాలు విరుద్ధంగా ఉంటే మీ భావాలను త్యాగం చేయండి. మనం ప్రాపంచిక విషయాల వలన మత్తెక్కుతున్నాము కాని భగవంతుడి యందు భక్తి వలన మనం ఎప్పుడైనా మత్తెక్కుతున్నామా? ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు మనం లోకాన్ని స్మరిస్తున్నాము, లోకంలో జీవిస్తున్నాము. ఇంక ఈశ్వరుడు కాసేపు కూర్చోవటానికి మీ హృదయంలో చోటు ఎక్కడ ఉంది?

మీరు ఆధ్యాత్మికంగా అభివృద్ధి అవ్వటానికి, నైతికంగా అభివృద్ధి అవ్వటానికి, భౌతికంగా అభివృద్ధి అవ్వటానికి ఏ విషయాలు అయితే మీకు అడ్డు వస్తున్నాయో వాటిని విషం కింద విడిచిపెట్టండి. ఇట్ ఈజ్ పాయిజన్, ఇట్ ఈజ్ మియర్ పాయిజన్. సమస్యలన్నింటిని సృష్టించే నీ మనస్సుకంటే పెద్ద సమస్య ఏదీ లేదు. ఈ మనస్సు అనే సమస్యను పరిష్కరించుకోవటానికి మీ జీవితంలో ఎంతకాలం ఖర్చుపెడుతున్నారు? మీకు దేహాలు మారవచ్చు, జాతి మారవచ్చు, లోకాలు మారవచ్చు కాని మనస్సు ఎంతకాలం అయితే ఉందో అంతకాలం మనిషి వెంట నీడ వచ్చినట్లు సంసారం కూడా వచ్చేస్తుంది. మనం భగవంతుడిని ప్రేమించటంలో కనుక కపటం లేకపోతే మన అహంకారం అందులో కరిగిపోతుంది. మనం భగవంతుడిని నిజంగా ప్రేమించటంలేదు కాబట్టి అది కరగటం లేదు. యదార్థం చెప్పాలంటే మనం లోకానికి భక్తులం కాని దేవుడికి భక్తులం కాదు. మనం లోకానికి దగ్గరగా ఉన్నామో, దేవుడికి దగ్గరగా ఉన్నామో మీ హృదయం మీకు చెప్పటం లేదా? నాతో చెప్పించటం మీకేమైనా మర్యాదగా ఉందా? అందరి హృదయాలలో నేను ఆత్మరూపంలో ప్రకాశిస్తున్నాను అని భగవంతుడు చెప్పాడు కదా, అది మరచిపోయి ఆ దేవుడని, ఈ దేవుడని, ఆ గురువు అని ఈ గురువు అని తిరుగుతున్నాము, మన హృదయంలో సజీవంగా ఉన్న ఈశ్వరుడిని వదిలేస్తున్నాము. మీ కళ్ళకు కనిపించే బయట విగ్రహాలు అన్నీ ఉపాసన కోసమే కాని నిజమైన దేవుడు మీ హృదయంలోనే ఉన్నాడు. పరమాత్మ గీతలో ఏమని చెప్పాడు అంటే నేను అందరి హృదయంలో ఆత్మగా ప్రకాశిస్తున్నాను అని ముందు చెప్పి, తరువాత నేను రాముడిని, నేను కృష్ణుడిని, నేను కుమారస్వామిని అని చెప్పాడు. రాతిమనుషులకు రాతిదేవుళ్ళను చూపిస్తే కాని వీళ్ళ బుర్రకు పట్టదు. తల్లి కడుపులో నుండి బయటకు వచ్చినది మొదలు ఆ ఊరు నుండి ఈ ఊరికి, యాత్రలకు అని వేలాది మైళ్ళు ప్రయాణాలు చేస్తున్నారు కాని మీ హృదయంలోనికి ఒక్క అంగుళం అయినా దిగారా మీరు? మీరు మైళ్ళు ప్రయాణాలు చేయవద్దు, మీ హృదయంలోనికి ఒక్క అంగుళం దిగండి





ఆహారంలో ఎండ్రిన్ కలిసింది అనుకోండి దానిని మనం తింటామా? తినము ఎందుచేత అది మనలను చంపేస్తుంది అని భయపడతాము. మనం తినే ఆహారం విషయంలో ఎలా జాగ్రత్త పడుతున్నామో అలాగే మనస్సుకు వెళ్ళే ఆహారం విషయంలో కూడా మనం జాగ్రత్తగా ఉండాలి. ఇతరులకు డబ్బు ఇవ్వాలంటే మీరు నష్టపోతారు కాని ఇతరులకు మంచిమాట చెప్పటానికి మీకు నష్టం ఏమిటి? మిమ్మల్ని డబ్బు ఖర్చుపెట్టుకోమని మేము చెప్పటంలేదు, ఎదుటివారి హితవుకోరటం వలన మీరు ఏమి నష్టపోతారు చెప్పండి? మీరు ఏమీ నష్టపోరు కదా అయినా కొంతమంది ఇతరులకు మంచిమాట చెప్పమంటే చెప్పరు, ఇతరుల హితవు కోరరు దీనికి వారిలో ఉన్న స్వార్థం కారణం.

ఏది ఉంటే మనం సుఖపడతామో, దేనిని పొందితే మనం శాంతిగా ఉంటామో దాని గురించి మనకు అవగాహనే లేదు, దానిని సాధించటం మాట అటుంచండి. మీకు కోరికలు ఉన్నాయి కాబట్టి వాటిని నెరవేర్చమని దేవుడికి దండలు వేస్తున్నారు. మీకు కోరికలు లేవు అనుకోండి మీరు దేవుడికి దండ వేస్తారా? మీరు ఏ ఉద్దేశంతో, ఏ సంకల్పంతో ఆ పని చేస్తున్నారో గ్రహించలేనంత అమాయకుడా దేవుడు. మీరు ఎదుటివాడికి రెండు రూపాయలు ఇచ్చారు అనుకోండి. అది గొప్పలకోసం ఇస్తున్నారా, లేకవాడు బాధపడుతున్నాడని ఆర్తితోటి ఇస్తున్నారా? మీరు ఏ ఉద్దేశంతో ఆ పని చేస్తున్నారో అది భగవంతుడు చూస్తాడు. మీరు కీర్తికోసం ఒక మంచి పనిని చేస్తున్నారు అనుకోండి, నేను చెయ్యవద్దు అని చెప్పటంలేదు కాని మీరు కీర్తికోసం చేస్తున్నారు అన్న సంగతి భగవంతుడికి తెలుస్తూ ఉంటుంది. దాని వలన మీకు కీర్తి వస్తుంది కాని జ్ఞానం రాదు. కీర్తి ఎవరికి? కీర్తి నాలో ఉన్న ఈశ్వరుడికా లేక అహంకారానికా? అహంకారానికే కీర్తి, ఈశ్వరుడికి కీర్తి ఎందుకు? మంచి పనులు చేసి మీరు కీర్తిని కోరుకుంటే మీకు కీర్తి వస్తుంది, కీర్తి వలన మీలో ఉన్న అహంకారం బలపడుతుంది. అహంకారం బలపడితే మీలో ఉన్న దేవుడికి మీరు దూరమవుతారు. ఈ విషయం మీకు అర్థమవ్వటంలేదు.

వాడికి వచ్చే తలంపులను బట్టి వాడు మహాత్ముడు, వీడు గొప్పవాడు, వీడు అల్పుడు అని చెపుతున్నాము. అయితే ఈ తలంపుల విషయంలో మనం ఎంతవరకు జాగ్రత్తపడుతున్నాము. మనం ఇంటి దగ్గర వంట విషయంలో, తాగే నీటి విషయంలో ఇలా అన్నీ విషయాలలో జాగ్రత్తగా ఉంటున్నాము కాని మనం వచ్చే తలంపుల విషయంలో జాగ్రత్తగా ఉండటంలేదు. అందరికీ తలంపులు వస్తున్నాయి. మనకు ఎటువంటి తలంపులు వస్తున్నాయి అని చూసుకుంటూ మీ తలంపుల విషయంలో జాగ్రత్తగా ఉంటే మీ దేహం దూదికింద అయిపోతుంది. మంచి తలంపులు మన బ్రెయిన్‌లోకి రాకపోతే మనం పక్కానికి రాము.

బాగా తియ్యగా ఉన్న పండును నోటిలో వేసుకుంటే ఎలా ఉంటుందో కొంతమంది మనుషులు అలా ఉంటారు. వారికి వచ్చే తలంపుల వల్ల వారి మనస్సు ఆ రకంగా పక్వము అవుతుంది. మీరు తెల్లవారుఝామున లెగుస్తున్నారు, స్నానాలు చేస్తున్నారు, పూజలు, జపాలు, ధ్యానాలు చేస్తున్నారు. అన్నీ మంచిదే కాని వాటివలన మీ అహంకారము ఏమైనా కరుగుతోందా? నేను చేసే పూజ వలన, జపం వలన నా అహంకారం కరగకపోతే వాటియొక్క ప్రయోజనం ఏమిటి? మనం కొంతకాలం కొంతమందిని ప్రేమిస్తాము, వారిని వదిలేస్తాము, మరల కొంతకాలం కొంతమందిని ప్రేమిస్తాము. ప్రేమించే వ్యక్తులు మారిపోతారు, స్నేహితులు మారిపోతారు, వస్తువులు మారిపోతాయి. బంధం మారుతూ ఉంటుంది కాని ఏదో ఒక బంధం ఉంటుంది. దూడను కట్రాడు మార్చినట్లు మనం నామ రూపాలను మారుస్తూ ఉంటాము. ఏ కట్రాడుకి కట్టేసినా దూడ అలా పడి ఉండవలసిందే. మనకు కొంతకాలం ఒక దేవుడు అంటే ఇష్టం, కొంతకాలం ఇంకొక దేవుడు అంటే ఇష్టం, మనం దేవుళ్ళను మారుస్తూ ఉంటాము, గురువులను మారుస్తూ ఉంటాము, స్నేహితులు మారిపోతూ ఉంటారు, ఏదైనా బంధమే. ప్రతీ మనిషికి సుఖంకావాలి, సుఖం అక్కరలేదు అని ఏ మనిషి చెప్పడు. కాని ఆ సుఖం ఎక్కడ ఉందో మనకు తెలియటం లేదు. ఆత్మకి మరొకపేరే సుఖం, ఆత్మ, సుఖం వేరుగా లేవు. మనకు సుఖం కావాలి కాని అది ఎక్కడ ఉందో మనకు తెలియదు, అది తెలిసేవరకు, ఆ వస్తువును పొందేవరకు ఈ దేహాలు తప్పవు, ఈ శవాలను మోయటం తప్పదు.

వైరాగ్యం లేని వ్యక్తికి జ్ఞానంరాదు. పది నిమిషాలు ప్రశాంతంగా కూర్చునేశక్తి మనకు లేదు కాని మనకు మోక్షం కావాలి. మనం నేను, నేను అంటున్నాము కదా, ఆ నేను అనే సమస్యను పరిష్కారం చేసుకోకుండా, దానిని పేస్ చేయకుండా మనం పూజలు, జపాలు, ప్రాణాయామం అంటూ కాలక్షేపం చేస్తూ ఉంటే మనస్సు తాత్కాలికంగా నిగ్రహించబడుతుంది కాని శాశ్వత పరిష్కారం మటుకురాదు. అసలు అలా ఉంచేసి వడ్డీ తీరుస్తూ ఉంటాము అనుకోండి, ఎంతకాలానికి ఆ ఋణం తీరుతుంది. అహంకారము ఒకటి, అప్పు ఒకటి దాచుకుంటే నెమ్మది నెమ్మదిగా అవి పెరిగిపోతూ ఉంటాయి. నేనును అలా ఉంచేసి మనో నిగ్రహం కోసం పూజలు, జపాలు చేస్తూ ఉంటే ఆ పది నిమిషాలు నెమ్మదిగా పడి ఉంటుంది తరువాత మనస్సు లేచి మరల విజృంభిస్తూ ఉంటుంది. వీటివలన మనస్సు టెంపరరీగా కుదురుగా ఉంటుంది కాని దానికి చావురాదు. మీకు దుఃఖం వస్తోంది అనుకోండి. ఏదో పూజ చేసో, జపం చేసో, భక్తి పాటలు వినో ఏదో కాలక్షేపం చేసి దానిని మరుగున పెడుతున్నారు. అంటే మనం తాత్కాలికంగా పరిష్కారం చేసుకొంటున్నాము.





తొలగించుకోమంటున్నారు. మీలో ఎన్ని బలహీనతలు ఉన్నప్పటికీ నన్ను హృదయపూర్వకంగా కనుక విశ్వసిస్తే వాడు కూడా నా భక్తుడే అని పరమాత్మ చెప్పాడు. నాపట్ల మీకు పరిపూర్ణమైన విశ్వాసం కనుక ఉంటే ఆవు తన దూడను ఎలా నాకుతుందో అలా మీలో ఉన్న దోషాలను అన్నీ నాకేసి మీకు మోక్షాన్ని ప్రసాదిస్తాను అని భగవంతుడు చెపుతూ ఉంటే దానిని మీరు సరిగా అర్థం చేసుకోవటం లేదు.

**సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ**
**అహంత్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః**

అన్ని ధర్మాలను విడిచిపెట్టు అని ఇక్కడ భగవంతుడు స్పష్టంగా చెపుతున్నాడు. నీ జీవలక్షణాలను అన్నింటిని మెర్సిలెస్‌గా విడిచిపెట్టు, ఎదుటివాడిమీద జాలిపడితే జాలిపడవచ్చు కాని నీ మీద నువ్వు జాలిపడకు. నీ అహంకార లక్షణాలన్నింటిని విడిచిపెట్టు. నన్ను ఒక్కడినే శరణు వేడుకో. నన్ను అంటే అక్కడ శరీరాన్ని అనికాదు, ఆత్మను శరణువేడుకో. ఆత్మయందే గురిపెట్టు నువ్వు ఆత్మనే ఉపాసిస్తూ ఉంటే, ఆత్మకోసమే జీవిస్తూ ఉంటే అన్ని పాపాల నుండి నేను నిన్ను విడుదల చేస్తాను అని స్పష్టంగా పరమాత్మ చెపుతున్నాడు. ఇక్కడ అనుమానానికి ఆస్కారంలేదు. ఆయన పట్ల విశ్వాసంలో కనుక లోపం లేకుండా ఉంటే నీలో ఎన్ని లోపాలు ఉన్నా, పాపాలు ఉన్నా, బలహీనతలు ఉన్నా, కోరికలు ఉన్నాసరే అన్నింటినుండి నిన్ను విడుదల చేస్తాను అని భగవంతుడు చెపుతున్నాడు. ప్రపంచంలో ఉన్న సంపదను చూసి మురిసిపోయేవాడే కాని, భగవంతుడిని చూసి మురిసిపోయే భక్తుడు ఎక్కడ ఉన్నాడు? ప్రతీ మనిషి నాకు అది ఉంది, నాకు ఇది ఉంది అని మీకు ఉన్న సంపదను, మీకు ఉన్న వస్తువులను, మీకు ఉన్న ఇంటిని, మీకు ఉన్న బ్యాంక్ ఎక్కౌంట్‌ను చూసి మీరు మురిసిపోతున్నారే కాని అన్నింటికి నాకు భగవంతుడు ఉన్నాడు అని భగవంతుడిని చూసి మురిసిపోయే భక్తుడు ఎక్కడ ఉన్నాడు? ధనబలం, విద్యాబలం ఇవి అన్నీ మనిషిని భగవంతుడికి దూరం చేస్తాయి. మీకు ఉన్న ధనం వలన, విద్య వలన మీకు గర్వం వస్తూ ఉంటే ఇంక మీకు దేవుడు ఏమి తెలుస్తాడు. ధనానికి, కీర్తికి బానిసలైన మీకు దేవుడు కావాలా? మీ చేతిలో డబ్బు ఉండవచ్చు కాని డబ్బు చేతిలో మీరు ఉండకూడదు. మీకు చదువు ఉండవచ్చుకాని చదువు చేతిలో మీరు ఉండకూడదు. అవి మీకు లోకువగా ఉంటే అప్పుడు మీకు మంచి చేస్తాయి. నువ్వు బెంగపెట్టుకోవద్దు, నువ్వు దుఃఖపడవద్దు. నన్ను పూర్తిగా విశ్వసించు. అప్పుడు నిన్ను మోహంలో నుండి, అజ్ఞానంలోనుండి విడుదలచేసే బాధ్యత నాది. నన్ను హృదయపూర్వకంగా విశ్వసిస్తూ

ఆయుధాలు తీసుకొని యుద్ధానికి రా అని చెప్పాడు అంతేగాని శక్తిహీనుడిగా ఉన్న రావణాసురుడిని బాణంపెట్టి చంపలేదు రాముడు, వాడు ధైర్యవంతుడు. అంతేగాని సీతను ఎత్తుకుపోయిన రావణాసురుడు ధైర్యవంతుడు కాదు. ఈ రోజున మనం ఒక మంచి పని చేయలేకపోతున్నాము అంటే, ఉదాత్తంగా జీవించలేకపోతున్నాము అంటే, ఉన్నతమైన భావాలతో మెలగలేకపోతున్నాము అంటే దానికి భయం కారణం. మనలో ఉన్న చెడ్డని విడిచిపెట్టి మంచిని ఆహ్వానించలేకపోతున్నాము అంటే భయం కారణం. కొంతమంది భయం వలన వారి మనస్సులో ఉన్న మాట కూడా పైకి చెప్పలేరు, అలా జీవితం పాడుగునా నలిగిపోయి కాలిపోయి రాలిపోతారు. మనం ఏ ఆదర్శాన్ని అయితే నమ్మెమో, ఏ విశ్వాసాన్ని అయితే నమ్మెమో అది తప్పు అని తెలిసినప్పటికీ దానిని విడిచిపెట్టలేకపోతున్నాము అంటే దానికి భయం కారణం. నేను ఒక విషయం చెపుతాను అనుకోండి. అది మంచి అని మీకు తెలుసును అనుకోండి. మీరు నమ్మిన విషయం చెడ్డ అని కూడా మీకు తెలుసును అనుకోండి. దీనిని విడిచిపెట్టేసి నేను చెప్పిన విషయాన్ని మీరు గ్రహించటానికి కూడా మీకు ధైర్యం ఉండాలి లేకపోతే మీకు రాదు.

భగవంతుడి మీద మనకు ఎంతో కొంత విశ్వాసం ఉంది కాని ఆ విశ్వాసం కంటే మన వాసనల యొక్క బలం ఎక్కువగా ఉంది. పోడూరులో ఎనిమిది వేల మంది జనాభా ఉన్నారు అనుకోండి. అందరూ వచ్చి ఇక్కడ కూర్చున్నారా? మీరు భక్తులు కాబట్టి శ్రద్ధగా ఇక్కడకు వచ్చి వింటున్నారు. మీకు భక్తికి సంబంధించిన వాసన ఎంతోకొంత ఉంది కాబట్టి మీరు ఇక్కడకు వచ్చారు లేకపోతే మీరు రారు కదా! మీకు ఎంతో కొంత భక్తి ఉంది, భగవంతుడి మీద విశ్వాసం ఉంది. అయితే మీకు భగవంతుడిమీద ఉన్న విశ్వాసం కంటే మీకు ఉన్న ప్రకృతి వాసనల యొక్క బలం ఎక్కువగా ఉంది. వీటి బలం ఎక్కువగా ఉండటం వలన ఇది భగవంతుడికి సంబంధించిన వాసనను అణిచివేస్తోంది. ఇప్పుడు మీరు చేయవలసిన పని ఏమిటి అంటే ప్రకృతి వాసనల బలాన్ని తగ్గించి, భగవంతుడికి సంబంధించిన వాసన యొక్క బలాన్ని పెంచుకోవాలి. ఆ బలాన్ని తగ్గించుకొని ఈ బలాన్ని పెంచుకోవటానికైనా భయం ఉంటే చెయ్యలేరు. నేను చెప్పే ఈ పాయింట్ మీకు అర్థమవుతోందా? ఏదైతే మీ శరీరానికి, మనస్సుకు, మీ క్షేమానికి చెడ్డ అని మీరు అనుకొంటున్నారో ఆ విషయాలను వదిలేయాలంటే మీకు ధైర్యం ఉండాలి. కొంతమంది ప్రతిదానికి రాజీపడుతుంటారు. ఇక్కడ కాంప్రమైజ్ అయ్యే సమస్య లేదు. మీరు అనుకొనేవి అన్నీ మూటకట్టి ఒక ప్రక్కన పెట్టండి. భగవంతుడు చెప్పిన ప్రతిమాట విశ్వసించండి. వాటిని విశ్వసిస్తే మీకు సొమ్ము లేకపోతే దుమ్ము. భగవంతుడు చెప్పిన మాటలను నమ్మటానికి కూడా భయమే మీకు అడ్డువస్తోంది కాబట్టి భయాన్ని





చనిపోయిన పాము వలన ప్రమాదం లేదు కాని అణిగి ఉన్న పాము వలన ఎప్పటికైనా మనకు ప్రమాదం ఉంది. ఇప్పుడు అణిగి ఉండవచ్చు కాని రేపు దానికి కోపం వస్తే అది బుస కొట్టవచ్చు. మీరు చేసే ప్రక్రియ వలన మనస్సు ఒక గంటో, రెండు గంటలో శాంతిగా ఉండవచ్చు, తరువాత విజృంభిస్తోంది కదా. మొత్తం మీద అక్కడ పాము ఉంది కదా! ఈ సమస్యను పరిష్కారం చెయ్యటానికి మీరు ఎందుకు సిద్ధపడటంలేదు? ఒకవేళ ఈ జన్మలో తప్పించుకొంటారు అనుకోండి, ఈ మనస్సు అనే సమస్యను వచ్చే జన్మలో అయిన పరిష్కారం చెయ్యటం తప్పదు. ఆ జన్మలో కూడా తప్పించుకొంటారు అనుకోండి, ఇంకొక జన్మలో అయినా తప్పదు.

భగవాన్‌తో ఒక భక్తుడు ఏమన్నాడు అంటే స్వామి నాకు ఇంటి దగ్గర ఉండాలని లేదు, ఏ కొండల ప్రాంతానికో వెళ్ళి సాధన చేసుకొంటాను అని చెప్పాడు. భగవాన్ ఏమన్నారు అంటే నువ్వు ఇల్లు విడిచిపెట్టేస్తావు, కాషాయగుడ్డలు వేసుకొంటావు, కొండప్రాంతానికి వెళతావు, నీకు ఏమి మారుతుంది? ఇల్లు మారుతుంది, పరిసరాలు మారతాయి, బట్టలు మారతాయి, ఊరు మారుతుంది కాని నీ అహంకారం ఏమైనా మారుతుందా? ఇంటి దగ్గర టైముకు కాఫీ తాగి, భోజనం చేసి నువ్వు అహంకారాన్ని జయించలేనప్పుడు కాఫీ దొరకనిచోట, తిండి దొరకనిచోట ఎక్కడో కొండలలో కూర్చుని అహంకారాన్ని జయిస్తావని గేరంటీ ఏమిటి? ఇక్కడ పరిస్థితులు అన్నీ అనుకూలంగా ఉన్నప్పుడు ఈ అహంకారాన్ని మనం జయించలేక, ఇల్లు విడిచిపెట్టిపోతే అహంకారాన్ని జయిస్తామనుకోవటం కూడా అహంకారం చేసే మాయే. మన కళ్ళకు కనిపిస్తున్న ఈ ప్రపంచాన్నంతా జయించి, మన మనస్సును కనుక జయించలేకపోతే మనం జీవితంలో ఏమీ సాధించనట్లే లెక్క. ఇది మీరు బాగా జ్ఞాపకం పెట్టుకోండి ఈ ప్రపంచాన్ని జయించిన వాడు వీరుడు కాదు, నీలోపల ఉన్న మనస్సును కనుక జయిస్తే నువ్వు వీరుడవు, నువ్వు ధీరుడవు. మనస్సు కల్పించిన మతమో, దేవుడో అని తిరుగుతున్నారు కాని ఈ మనస్సు అనే సమస్యను ఎందుకు పరిష్కారం చెయ్యరు? మీ భర్త, పిల్లలు సంసారం కాదు, మీ మనస్సే సంసారం. ఈ మనస్సు అనే సమస్యను పరిష్కారం చేసుకోవటానికి మీరు ఎందుకు సిద్ధపడటంలేదు, ఎందుకు వాయిదాలు వేస్తున్నారు?

కొంతమంది ఏమి చేస్తారు అంటే ఈ దేహాన్ని శిక్షిస్తారు. ఈ దేహం ఏమి చేస్తుంది? కూర్చోమంటే కూర్చొంటుంది, నడవమంటే నడుస్తుంది, తినమంటే తింటుంది. మనస్సు ఏమి చెయ్యమంటే అది చేస్తుంది. అది ఏమీ పాపం చెయ్యదు. తప్పు చేసేది మనస్సు, దెబ్బలు తినేది దేహం, ఇది ఏమైనా మీకు న్యాయంగా ఉందా చెప్పండి. నా మనస్సు

పోడూరు రమ్మంటే ఈ దేహం ఇక్కడకు వచ్చిందా లేకపోతే మనస్సు చెప్పకుండానే అది పోడూరు వచ్చేసిందా? మనస్సు ఏమి చెయ్యమంటే అది చేస్తుంది. మంచి చెయ్యమంటే మంచి చేస్తుంది, చెడ్డ చెయ్యమంటే చెడ్డ చేస్తుంది. మనస్సు చేసే ప్రతీ తప్పకు దేహం దెబ్బలు తింటోంది. పెళ్ళిళ్ళు అయిపోయిన తరువాత చూసుకొందాము, సాధన చేసుకొందాము అంటారు. అది చెప్పేది కూడా మనస్సే. ఇప్పుడు దాని గొడవలోనికి రాకుండా పిల్లల పెళ్ళిళ్ళు అయిపోయిన తరువాత చూద్దాము అని అదే చెపుతుంది. అంటే ఎంతసేపు సమస్యను వాయిదా వేయటానికి మనస్సు చూస్తూ ఉంటుంది. మీరు ఎన్ని విషయాలు తెలుసుకోమన్నా మనస్సు తెలుసుకొంటుంది కాని దానిగురించి దాన్ని తెలుసుకోమంటే అది తెలుసుకోదు. మనస్సు యొక్క మూలం తెలియకపోతే వాడు జ్ఞాని కాలేడు. మనలోపల అజ్ఞానం ఉన్నంతకాలం సమస్య పరిష్కారం కాదు. అయితే మనం చేసే పూజల వలన, జపాల వలన ఏమీ ఉపకారం లేదా అని మీరు అడగవచ్చు. వాటి వలన తాత్కాలిక ఉపశాంతి ఉంటుంది. మనకు పాము కనిపించింది అనుకోండి, దానికి పాలు పోస్తే ఆ పాలు తాగేసి కొంతసేపు పక్కన పడి ఉండవచ్చు, తరువాత అది బుసకొట్టవచ్చు. భయంకరమైన సర్పం ఎటువంటిదో మన అహంకారం కూడా అటువంటిదే.

నేను ఒక ప్రశ్న అడుగుతాను సమాధానం చెప్పండి. మీకు అసలు ఏమీ దుఃఖం లేదు అనుకోండి. మీకు దేవుడితో పని ఏముంది? మీరు ఇంటికి వెళ్ళి ప్రశాంతంగా కూర్చుని ఆలోచించండి. మీకు ఏ రకమైన దుఃఖం కనుక లేకపోతే అసలు మీకు దేవుడి సమస్య లేదు. ఇది మీరు గుండెల్లో పెట్టుకోండి. ఇప్పుడు మీకు దుఃఖం ఉంది కాబట్టి దానిని పోగొట్టుకోవటంకోసం దేవుడి సహాయం కోరుతున్నారు. మీలో ఏదో వెలితి ఉంది కాబట్టి దానిని తొలగించుకోవటంకోసం దేవుడి సహాయం మీరు కోరుతున్నారు. ఏ సుఖం కోసం, ఏ శాంతి కోసం మీరు దేవుడిని ప్రార్థిస్తున్నారో ఆ సుఖం, శాంతి మీ లోపలే ఉన్నాయి కాని అవి మీ లోపల లేవని మీరు అనుకొంటున్నారు. ఇదే మాయ. మాయ అంటే ఏమీ లేదు నిజం అబద్ధంగా కనిపిస్తుంది, అబద్ధం నిజంలా కనిపిస్తుంది, ఇదే మాయ. మీరు ఆవేశం పెంచుకోవటం కాదు, ఆలోచన పెంచుకోవాలి. మనిషి ఎంతవరకు ఆవేశానికి గురిఅయ్యాడో అంతవరకు పాపం చేస్తాడు. ఆలోచన ఉంటే పుణ్యం చేస్తాడు. మనిషి ఆవేశానికి లొంగుతున్నాడు, ఆలోచనకు దూరం అవుతున్నాడు. మీరు పువ్వులతో రాముడిని, కృష్ణుడిని ఎలాగైతే ఆరాధిస్తున్నారో అలాగే ఈ సృష్టిని మీరు పనితో ఆరాధించండి, అప్పుడు మీకు జ్ఞానం కలుగుతుంది. మనం పువ్వులతో ఆరాధించటం నేర్చుకొన్నాము కాని పనితో ఎలా ఆరాధించాలో నేర్చుకోలేదు. మన అహంకారాన్ని ఒక ప్రక్కన పెట్టి భగవంతుడు





చెప్పినట్లుగా మనం నడుచుకుంటే ఈ లోకంలో యాత్ర సుఖంగా వెళ్ళిపోతుంది, మనకు జ్ఞానం కలుగుతుంది. మనకు జ్ఞానమే ప్రధానం అనుకొంటే ముందు భయంపోవాలి. భయం ఉన్నవాడికి జ్ఞానం కలగదు. మీరు ఏ విషయం గురించి భయపడవద్దు. భారం అంతా ఈశ్వరుడి మీద వెయ్యండి. మీకు నిజంగా ఈశ్వరుడి మీద విశ్వాసం ఉంటే ఇంక ఎందుకు మీకు భయం వేస్తోంది. మనకు ఎప్పుడైతే భయం వేస్తోందో అప్పుడు ఆలోచన తగ్గిపోతుంది, ఉన్నది కూడా మర్చిపోతాము. భయం మనకు ఉపకారం చెయ్యదు, అపకారం చేస్తుంది.

భగవంతుడి పట్ల భక్తి కలిగి ఉండాలి. భక్తి ఉన్నవాడు చెడ్డ చెయ్యడు. భయం ఉంటే మనం భగవంతుడిని తెలుసుకోలేము అందుచేత భయాన్ని విడిచిపెట్టమని చెప్పాడు. దైవీసంపదలో మంచిగుణాలకు ముందు అభయం అనిచెప్పాడు. గొప్పగుణాలు అనేకం భగవంతుడు చెప్పాడు కాని అన్నింటిలో గొప్పగుణం అభయం అని చెప్పాడు. ఎవడైతే బలహీనుడో, ఎవడైతే బద్ధకస్తుడో, ఎవడైతే భయపడుతున్నాడో వాడికి ఆత్మ తెలియబడదు అని పరమాత్మ చెప్పాడు. భయం జ్ఞానవిరోధి కాబట్టి భయాన్ని విడిచిపెట్టమని చెపుతున్నాడు. నాకు భయం ఉంటే జ్ఞానం కలుగదు కాబట్టి భయాన్ని విడిచిపెట్టమని చెప్పాడు. భయపడేవాడు తాను మోహించే వస్తువుల నుండి దూరం కాలేడు. పిరికివాడు తాను మోహించే విషయాన్ని నరుక్కోలేడు. భక్తి అనేది కత్తిలాంటిది. మనం భక్తిని సంపాదించి ఆ కత్తితోటి నీలో ఉన్న మోహాన్ని నరుక్కోవాలి. ధైర్యవంతుడు ఎవడూ చెడ్డపనిచెయ్యడు, పిరికివాడు చెడ్డ పని చేస్తాడు. భయం వలన చెడ్డపని చేస్తాడు. నేను ఇంకొక మనిషిని చంపాను అంటే వాడు ఏదో నాకు అపకారం చేస్తాడు అని కంగారు పడిపోయి వాడిని చంపేస్తున్నాను. నేను పిరికివాడిని కాబట్టి చెడ్డ చేస్తున్నాను, పాపం చేస్తున్నాను. నిజంగా నాలో ధైర్యం ఉంటే నేను చెడ్డపని చెయ్యనే చెయ్యను. నేను నిజంగా బలవంతుడిని అయితే ఈ పోడూరులో కలరా ఉన్నా అది నాకు అంటుకోదు. రోగాన్ని నిరోధించుకొనే శక్తి నా శరీరానికి సహజంగా ఉంటే నేను రోగగ్రస్తుల మధ్య ఉన్నా నా శరీరానికి రోగం రాదు. నా శరీరం కనుక బలహీనంగా ఉంటే ఆ కలరా నాకు కూడా వచ్చేస్తుంది. అదేవిధంగా నా మనస్సులో కనుక దుర్గుణం లేకపోతే నేను చెడ్డపని చెయ్యనే చెయ్యను. ఎవడు ధైర్యవంతుడు? రాముడికి, రావణాసురుడికి యుద్ధం జరుగుతూ ఉంటే రావణాసురుడికి ఆయుధాలు అన్నీ పోయాయి, గుర్రాలు చనిపోయాయి, రథం పగిలిపోయింది. అప్పుడు రాముడు ఏమన్నాడు అంటే ఓ రావణా! నీ గుర్రాలు, రథం అన్నీ పోయాయి, నువ్వు ఇంటికి వెళ్ళిపో, స్నానం చేసి భోజనం చేసి విశ్రాంతి తీసుకొని మరల రేపు కొత్త గుర్రాలు, రథం,

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

జనవరి 12 భగవాన్ జయంతి, శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

# భగవాన్ శ్రీ రమణమహర్షి

అనాదిగా వస్తున్న ఎందరో మహాత్ముల పరంపరలో జన్మించి, అఖండమైన ఉనికిలో తాను కదలకుండా ఉండి, ప్రపంచములోని అనేకమంది జిజ్ఞాసువులను తనవైపుకు ఆకర్షించి, తన సమక్షము మరియు దివ్యజ్ఞానబోధతో మానవులలోని భక్తి భావాన్ని, అంతరదృష్టిని, ముముక్షత్వాన్ని, పెంపొందించిన సుజ్ఞానగుణమణి భగవాన్ శ్రీ రమణమహర్షి. ది॥ 30-12-1879న తిరుచ్చుళి గ్రామంలో ఒక దేహం ధరించి, పిమ్మట మధురైలో అమృతానుభవమును పొంది, తరువాత పవిత్ర అరుణాచలం కేంద్రంగా ఏబది నాలుగు సంవత్సరములు తత్త్వబోధ చేసిన భగవాన్ శ్రీ రమణుల సందేశమే విశ్వాత్మ సందేశం. ఆధునిక ఋషి అయిన భగవాన్ శ్రీ రమణుని జీవితమే ఆయన సందేశం. బాహ్యముగాను మరియు గ్రంథములలోను పరమాత్మను గురించి వెదికే మానవాళికి అంతరదృష్టిని కలిగించి, వాస్తవంగా తాను ఎవరో? తెలుసుకొని హృదయంలో స్వరూపంగా ఉన్న అద్వయ చైతన్యాన్ని 'నేను'గా 'తాను'గా అనుభవంలోకి తెచ్చుకొనుటయే సకల మానవాళి అంతిమ లక్ష్యమని చాటిచెప్పిన జ్ఞానవల్లభుడు. ఉపనిషత్తుల సారమైన భగవాన్ శ్రీ రమణుల వాక్కులు సరళంగాను, సంక్షిప్తముగాను, భావగర్భితముగాను, ఉంటాయి. "స్వరూప అమృత స్థితి సాధన చేసి ఎప్పడో, ఎక్కడో పొందేదికాదు అది ఇప్పడే, ఇక్కడే మన స్వరూపంగానే ఉంది. దేనినో తెలుసుకోవడమూ కాదు, ఏదో అవడము కాదు, 'నేను' అని మనము అందరము అంటాము ఆ నేనుకు మరో పేరే ముక్తి, కాబట్టి "నేను" "నేను"గా ఉండడమే ముక్తి" అంటారు భగవాన్ శ్రీరమణులు. మానవాళిని తమ స్వస్థితిలోకి మేల్కొలుపుటకు ఆయన చేసిన జ్ఞానబోధ అందరికీ ఆదర్శమై, నిరంతరం గమ్యం గురించి ఆలోచింపజేస్తుంది. మనందరికి భక్తిని, అఖండసాధనా సంపత్తిని, సద్బుద్ధిని, చిత్తశుద్ధిని, శ్రీరమణగురుదేవులు ప్రసాదించుగాక!

**(ది. 12-01-2017 శ్రీరమణ జయంతి సందర్భంగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# శాంతి చిత్తులే - సత్యాన్ని దర్శిస్తారు

ప్రస్తుత మన జీవనం సత్యమనుకొని గట్టిగా భావిస్తాము. దీన్ని మనం స్వప్నముకంటే ఏమీ విలువైనది కానేకాదు. సత్యానుభవం కలిగితే ఈ నిజం తెలుస్తుంది. అప్పడే మనకు చిత్తశాంతి కలుగుతుంది. మనోపరిధిలో ఉన్నంతకాలం ప్రకృతి మాయలో కొట్టుకుపోతాం. పుణ్యపరిపక్వమైన సద్గురువు లభించినప్పడే ఈ సత్యం హృదయానికి హత్తుకుంటుంది. మనం మౌనంగా శబ్దం లేకుండా ప్రకృతిని కేవలంగా చూస్తూ ఉంటే లోపల ఒక శాంతి జన్మించటం ప్రారంభమౌతుంది. సాక్షీభావము శబ్దగ్రహణం వల్ల చనిపోతుంది. లోపల విచారాలు నడిస్తే మౌనంగా చూస్తూ ఉండాలి. మనం ఏమీ చెయ్యకూడదు. మన ప్రయత్నము దాటిన తరువాత ఏది అవుతుందో దాన్ని కానియ్యాలి ఇలా ఉంటే ఓ కొత్త ప్రపంచంలో అడుగుపెడతాము. అందుకే త్యాగరాజు "శాంతము లేక సౌఖ్యము లేదు యోగులకైనా భోగులకైనా" అన్నారు. గురువు మన సత్య జీవితాన్ని ఎలా గడుపుతున్నాడో నిరంతరం చూస్తూనే ఉంటారు లోపాలు ఉంటే సత్సంగంలో ఎలా తొలగించుకోవాలో సూచిస్తారు. జీవితం అంటే సూటిగా ఉండే గీత కాదు. ప్రతీ మానవుడు పడే మానసిక పోరాటంలో ఎన్నో వంకర టింకరలుగా ఉంటాయి. దాన్ని శాంతిచిత్తులే, నిదానంగా సరిజేసుకొని జీవించగలరు. క్రోధం, అహంకారం అన్నదమ్ములు ఒకరు వస్తే రెండవవారు తప్పకవస్తారు. అవి మనలో ఉన్నాయి కాబట్టి అదును చూచుకొని వస్తాయి దాన్ని గురుకటాక్షంతో స్వప్రయత్నంతో అదుపులో ఉంచుకోవాలి. ప్రేమ మరియు ప్రాజ్ఞ రెండూ బీజమంత్రాలు. వాటిని అర్థం చేసుకొంటే సర్వం అర్థమౌతుంది. అహంకారం హృదయాన్ని పాషాణం చేస్తుంది. జీవనంలో ఏ సత్యం - శివం - సుందరముందో వాటినన్నిటినీ ఎరుకలోనికి రాకుండా నశింపజేస్తుంది. ధర్మవిచారణలో ఉంటే అధికసత్యం మరియొకటి లేదు. జీవితం అంతా ధర్మ ప్రమాణాల్లో ఉంటే జీవితం సత్యమౌతుంది. సత్యం ఎక్కడ ఉంటే అక్కడే శక్తి ఉంటుంది. అక్కడే శాంతి జీవనం ఉంటుంది. దానికి మనం ఈ సృష్టిని అంతా ప్రేమించాలి. అందరిలోనూ గురువును చూడాలి. చేతనైతే సేవ చెయ్యాలి. మనం నిర్మలమై పవిత్రంగా ఉంటే అంతర్యామిగా ఉన్న పరమాత్మ తత్త్వం తొందరగా అర్థమౌతుంది శాంతికి నిలయమౌతాము. కంటికి కనిపించే వస్తువుల్లో స్ఫటికానికి రంగులేదు దాన్ని ఎర్రగుడ్డమీద ఉంచితే ఎర్రగాను, నల్లగుడ్డపై ఉంచితే నల్లగాను కనిపిస్తుంది, అనిపిస్తుంది. ఆత్మవెలుగులో మన అరిషడ్వర్గాలు అవే నిజమనిపిస్తాయి. రుచి చూచే వస్తువుల్లో వెన్నకు కూడా రుచిలేదు. పైరెంటిలా మన మనస్సు తయ్యారైతే వాసుదేవస్వామి మన మనస్సును తినేస్తాడని శంకరభగవత్పాదులు బోధించారు. అంతర్ముఖంగా మరలటం వల్ల అనాశక్తిని సాధించవచ్చు. మనం సాక్షిగా మారినప్పడు మాత్రమే నిజమైన మార్పు ప్రారంభమౌతుంది. నవరసాల్లోను శాంతం నిర్మలమైనది, పరిశుద్ధమైనది. అప్పడు మనస్సు వృత్తిరహితమైన సమాధిని పొందుతుంది. ఆ రసానుభవమందు మనస్సు తన్మయత్వం పొంది శాంతిరసమై శాంతిమయమై పోతుంది అని అనుభవజ్ఞులు, ఉపనిషత్తులు ఘోషిస్తున్నాయి. సాధకుని ధ్యేయం దీన్ని అనుభవంలోనికి తెచ్చుకోవాలి.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**

**Vol : 22 Issue : 05**
**05-01-2017**